సాక్షి
రంగారెడ్డి
బుధవారం ı 8 ı మే ı 2024



అదనపు సమయం

ఓటర్ స్లిప్పుల పంపిణీ 96 శాతం పూర్త యిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. 10లో▸



కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. 10లో▸



మేం సిద్ధం

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. 10లో▸

న్యూస్‌రీల్

నేడు షాద్‌నగర్‌కు అస్సాం ముఖ్యమంత్రి రాక

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం షాద్‌నగర్ పట్టణానికి అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ విచ్చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 7గంటలకు షాద్‌నగర్ పట్టణంలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి అస్సాం ముఖ్యమంత్రితో పాటు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ హాజరు కానున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లు నిర్భయంగా ఓటు వేయాలి

జిల్లా సంక్షేమాధికారి పద్మజారమణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి పద్మజారమణ

ఇబ్రహీంపట్నం రూరల్: ట్రాన్స్‌జెండర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమాధికారి పద్మజా రమణ పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని మహిళా సాధికారిత కేంద్రంలో మంగళవారం ట్రాన్స్‌జెండర్లకు ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఉచిత ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్లు, ఐడీ కార్డులు అందజేశారు. అనంతరం పద్మజారమణ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారు తప్పకుండా ఓటు వేయాలని సూచించారు. మహిళా సాధికారిత కేంద్రంలో ట్రాన్స్‌జెండర్స్ కోసం తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ట్రాన్స్‌జెండర్స్ ఎక్కడైనా వివక్షకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం కావాల్సిన అఫిడవిట్లు, నోటరీపత్రాలను క్వీర్ బందు పేరెంట్స్ అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకురాలు ముకుందమాల ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ శ్రీదేవి, సీడీపీఓలు, మహిళా సాధికారిత సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డితో కొండా భేటీ

మద్దతు ఇవ్వాలని కోరిన విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత బి.జనార్దన్‌రెడ్డితో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన జనార్దన్‌రెడ్డి కొన్నాళ్లుగా ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఆరోగ్యరీత్యా విరామం తీసుకుంటున్న ఆయన సేవలను పార్టీకి వినియోగించుకోవాలని భావించిన కొండా.. ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రానున్న లోకసభ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. దీనికి జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఇరువురి కలయికతో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. కొండా వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు నవీన్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

బహుజనుల గొంతుకలను గెలిపించుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గౌడ సామాజిక వర్గానికి చెందిన బహుజన గొంతుకలు బూర నర్సయ్య గౌడ్, పద్మారావు గౌడ్‌లను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గౌడ జన హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న గౌడ కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యమివ్వకపోవడం బాధాకరమన్నారు. బీసీల్లో అత్యధిక జనాభా కలిగి ఉండి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న వీరిని గెలిపించుకోవాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వారసత్వాన్ని పార్లమెంట్‌లో నిలబెట్టాలని కోరారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం ఇరువురు పని చేశారని గుర్తు చేశారు. వలస పాలకుల ఆధిపత్యాన్ని ఎదురించి డాక్టర్ల జేఏసీ చైర్మన్‌గా పని చేసిన బూర నర్సయ్యగౌడ్, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా సేవలు అందించిన పద్మారావుగౌడ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరం ప్రజల పక్షాన, ప్రజల మధ్య ఉండి వారి హక్కుల కోసం పోరాడుతున్న వీరిని లోక్‌సభకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

యువ.. హవా!

చేవెళ్ల లోక్‌సభ పరిధిలో యువ ఓటర్లే కీలకం

- 39 ఏళ్లలోపు వారు 15,20,890 మంది
- వీరు ఎవరి వైపు మొగ్గు చూపితే వారికే విజయావకాశాలు
- యువతే టార్గెట్‌గా ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం



268 మంది శతాధిక వృద్ధులు!

లోక్‌సభ స్థానంలో యువ ఓటర్లే కాదు.. శతాధిక వృద్ధులు కూడా ఉన్నారు. మహేశ్వరంలో 95 మంది, రాజేంద్రనగర్‌లో 65 మంది, శేరిలింగంపల్లిలో 8 మంది, చేవెళ్లలో 93 మంది, వికారాబాద్‌లో ఐదుగురు, తాండూరులో ముగ్గురు ఉన్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో వెల్లడైంది. వీరిలో మెజార్టీ ఓటర్లకు పుట్టిన రోజు ధ్రువపత్రాలు లేకపోవడం, ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదో ఒక సంవత్సరం, తేదీ పేర్లు చెప్పడం, ఎన్నికల అధికారులు కూడా ఇవేవీ పట్టించుకోకుండా గుడ్డిగా వారి పేర్లతో పాటు వయసు నమోదు చేశారు. నిజానికి వీరి వయసు వందేళ్ల లోపే ఉండగా, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అధిక వయసు నమోదైనట్లు సమాచారం. ఇక 90 నుంచి 99 ఏళ్ల వయసు వారు 4,759 మంది ఉండటం విశేషం.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం కాబోతున్నారు. వారు ఎటువైపు మొగ్గు చూపితే.. ఆ పార్టీ అభ్యర్థికే విజయావకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు సైతం యువతే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మెజార్టీ ఓట్లు సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కొనసాగుతుండగా, వీటిలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15,04,260 మంది పురుషులు ఉండగా, 14,33,830 మంది మహిళలు, 280 మంది ఇతరులు ఉన్నారు. 18 నుంచి 39 ఏళ్లలోపు వారు 15,20,890 మంది (52శాతం) ఉండటం విశేషం. ఓటు హక్కు వినియోగించుకునే అంశంపై ఇప్పటికే వీరంతా ఓ స్పష్టతకు రావడంతో పాటు కుటుంబ సభ్యులు, నివాస ప్రాంతాన్ని, సామాజిక వర్గాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు ఈ యువత నే ప్రధానంగా దృష్టిలో పె ట్టుకుని ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మెగా డీఎస్సీ వేయనున్నట్లు ప్రచారం చేస్తుండగా, బీజేపీ అభ్యర్థి మోదీ సాధించిన విజయాలు, స్వయం ఉపాధి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ఎజెండాగా చేసుకుని ప్రచారం చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి సాగు నీరు, ఉచిత కరెంట్, రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఉద్యోగాలు వంటి అంశాలను ప్రచారం చేస్తున్నారు.

బరిలో 43 మంది.. ప్రచారంలో ముగ్గురే

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మినహా క్షేత్రస్థాయి ప్రచారంలో ఇతరులు పెద్దగా కన్పించడం లేదు. క్షేత్రస్థాయిలోనే కాదు కనీసం సోషల్ మీడియాలోనూ వీరి ప్రచారం కన్పించక పోవడాన్ని పరిశీలిస్తే వీరంతా పేరుకే పోటీ చేస్తున్నట్లు కనిపిస్తోంది. పోటీ చేస్తున్న వారిలో మెజార్టీ అభ్యర్థులు 40 ఏళ్లలోపు వారే. పీజీ, పీహెచ్‌డీ, ఎంబీఏ, బీటెక్ వంటి ఉన్నత కోర్సులు పూర్తి చేసిన వారే ఉండటం గమనార్హం.

వయసు వారీగా ఓటర్లు

నియోజకవర్గం	18–19	20–29	30–39	40–49	50–59	60–69	70–79	80–89	90–99	100–120
మహేశ్వరం	50,963	1,04,113	1,64,775	1,21,057	77,682	45,610	22,465	6,400	1,236	95
రాజేంద్రనగర్	55,568	1,13,241	1,92,334	1,41,689	80,468	45,070	20,191	4,522	791	65
శేరిలింగంపల్లి	54,138	1,12,281	2,39,949	1,93,788	99,951	59,885	30,233	7,779	1,304	08
చేవెళ్ల	28,822	57,685	70,239	55,732	39,153	23,535	11,353	3,339	578	93
పరిగి	10,368	62,369	77,230	50,845	33,269	20,423	9,483	2,249	321	00
వికారాబాద్	7,081	50,173	69,561	44,148	31,551	18,491	8,390	1,937	301	05
తాండూరు	8,716	57,625	71,011	47,974	32,034	17,191	7,556	1,754	228	03



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో కురుస్తున్న వర్షం

చల్లగా.. హాయిగా

కొద్ది రోజులుగా జిల్లావ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ క్రమంలో మంగళవారం ఉరుములు, మెరుపులు.. ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. దీంతో ఉపశమనం దొరికింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల వడగళ్లు కురిసాయి. మామిడికాయలు నేలరాలాయి.

పోలింగ్‌కు జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంక అధికారులకు సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వికారబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాభారతితో కలిసి చేవెళ్ల లోక్‌సభ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, మేరినాట్ పాఠశాలలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ.. ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరం మేరకు అదనంగా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఈవీఎంల పంపిణీ రోజున అన్ని మౌలిక సదుపాయలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. హెల్ప్ డెస్కలను సందర్శించి ఫెసిలిటేషియన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయని వారికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. శశాంకకు వికారాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా భారతి, జెడ్పీసీఈఓ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

వికారాబాద్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం చేవెళ్ల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి వికారాబాద్‌లో పర్యటించారు. వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని మేరీ ఏ క్వోటాస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. కమిషనింగ్ ప్రక్రియ, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తాండూరులోని సెయింట్ మార్క్స్ ఇంటర్నేషనల్ హై స్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లను, పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని మినీ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాభారతి, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఫెసిలిటేషన్ కేంద్రం నోడల్ అధికారి సాజీదాబేగం, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెబుదాం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుదాం.. కష్టపడి పనిచేయండి గెలుపు మనదే అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి రోడ్డుషో నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ.. గ్యారంటీలు అమలయ్యే గ్రామాల్లో మేం ఓట్ల అడగమని, అమలు కాని గ్రామాల్లో మీరు ఓట్లు అడగొద్దని చెప్పారు. ప్రజలు నమ్మి అధికారం ఇస్తే ఈ నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. పేదల వర్గాలకు అండగా ఉంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాష్ట్రంలో కరెంటు పోయినా, నీరు రాకపోయినా, పంటలు ఎండియినా పట్టించుకునే దిక్కే లేదని విమర్శించారు. కేసీఆర్ సభలకు ప్రజలు బ్రహ్మరథం పడుతూ కష్టాలు చెబుతున్నారని చెప్పారు. నమ్మిన పార్టీని, కేసీఆర్‌ను మోసం చేసిన రంజిత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి రాముడి గుడి, రాముడి పేరు చెప్పి ఓట్లు వేయాలని అడుగుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలిసిన నాయకుడిగా ఈ ప్రాంత గొంతుకుగా ఉంటానన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి కట్టుబడి ఉన్నారని తమ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు బహుమతి ఇస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు నక్క శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



షాబాద్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సబితారెడ్డి. చిత్రంలో కాసాని, కాలె యాదయ్య

స్వతంత్రుల ప్రభావం కొంతే!

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రుల ప్రభావం తక్కువనే చెప్పాలి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో పోలైన మొత్తం ఓట్లలో స్వతంత్ర అభ్యర్థులకు దక్కిన ఓట్లు కేవలం ఒక్క శాతం మాత్రమే. గత ఎన్నికల్లో సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల్లో 47 లక్షల మంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనగా.. ఇండిపెండెంట్లకు 50 వేల కంటే తక్కువే ఓట్లు పోలయ్యాయి. గ్రేటర్ చరితలో నాలుగు లోక్‌సభ సెగ్మెంట్లలోనూ ఇప్పటివరకు ఒక్కసారిగా కూడా స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన దాఖలాల్లేవు.

- 2019లో గ్రేటర్‌లో వీరికి పోలైన ఓట్లు ఒక్క శాతమే
- నాలుగు సెగ్మెంట్లలో కలిపి 50 వేల లోపే..
- ఈసారి బరిలో 66 మంది ఇండిపెండెంట్లు
- స్థానిక సమస్యలే ఎజెండాగా ప్రచారం
- గ్రేటర్ చరిత్రలో ఒక్కసారి కూడా గెలవని అభ్యర్థులు



సెగ్మెంట్ల వారీగా స్వతంత్రుల ఓట్లు..

- 2019 లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలో 9 మంది స్వతంత్ర అభ్యర్థులకు కలిపి 5,173 ఓట్లు మాత్రమే పడ్డాయి. ఈ నియోజకవర్గ పరిధిలోని 8.7 లక్షల ఓట్లలో వీరి బలం కేవలం 0.5 శాతం మాత్రమే.
- సికింద్రాబాద్ సెగ్మెంట్‌లోనూ ఇదే తీరు కనిపించింది. మొత్తం 9.1 లక్షల ఓట్లు పోలవగా.. ఈ నియోజకవర్గంలో బరిలోకి దిగిన 15 మంది స్వతంత్రులు సాధించిన ఓట్లు 10,051 మాత్రమే.
- ఇక మల్కాజిగిరి, చేవెళ్ల సెగ్మెంట్లలో ఇండిపెండెంట్‌లకు 30 వేల ఓట్లు వచ్చాయి.

ఈసారి బరిలోకి 66 మంది

ఈ నెల 13న జరగనున్న లోకసభ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ నుంచి పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు గాను 525 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా.. వీరిలో 50 మంది మహిళలు, 475 మంది పురుష అభ్యర్థులున్నారు. మొత్తం 286 మంది స్వతంత్రులు పోటీపడుతున్నారు. అత్యధికంగా మెదక్ లోక్‌సభ నుంచి 29 మంది ఇండిపెండెంట్‌లు బరిలోకి దిగారు. గ్రేటర్‌లో చూస్తే.. చేవెళ్లలో 21 మంది, మల్కాజిగిరిలో 11, సికింద్రాబాద్‌లో 27, హైదరాబాద్‌లో 7 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

స్థానిక సమస్యలే ఎజెండా..

గ్రేటర్‌లోని స్థానిక సమస్యలే ప్రధాన ఎజెండా స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నారు. స్వచ్ఛంద కార్యక్రమాల నిర్వహణతో పాటు సామాజిక వర్గాలను నమ్ముకొని పోటీ పడుతున్నారు. యువ ఓటర్లను ఆకర్షించేందుకు ఎక్స్, ఇన్‌స్టాగామ్ వేదికగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మహిళలు, వృద్ధ ఓటర్లను మెప్పించేందుకు స్థానికులు, కుటుంబీకులతో కలిసి పలు ప్రాంతాల్లో సాయంత్రం సమయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఎన్నికల సంఘం స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు, బేబీ వాకర్, రోడ్డు రోలర్ వంటి పలు గుర్తులను కేటాయించింది.

చేవెళ్ల అభివృద్ధే లక్ష్యం

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మొయినాబాద్: చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధే తన లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు చిలుకూరు బాలాజీ దేవాలయంలో పూజలు చేశారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రజలకోసమే నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికోసం ఇప్పటికే పలు కంపెనీలను తేవడం జరిగిందని.. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణగౌడ్, వీరభద్రస్వామి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

మీర్‌పేట: కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమం కోరుకునేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్‌లో జరిగిన బైకుర్యాలీలో ఆయన పాల్గొని నందిహిల్స్ కూడలిలో మాట్లాడారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేశామని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అన్ని హామీలను నెరవేరుస్తామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు లేవని, వారు అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్, పెన్షన్లు, సిలిండర్లు వద్దంటున్నారని, ఏ పార్టీ ప్రజలకు ఏం చేస్తుందో, అభ్యర్థి ఏం చేస్తాడో ఆలోచించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధితో పాటు ప్రజలకు సాయం చేశానని తెలిపారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అందుబాటులో ఉండడు.. అపాయింట్‌మెంట్ అడుగుతాడని ఎద్దేవా చేశారు. గెలిచిన వెంటనే నందిహిల్స్ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ ముద్దా పవన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నాయకులు సామిడి గోపాల్‌రెడ్డి, సిద్దాల దశరథ, జిల్లెల నరేందర్‌రెడ్డి, జెటావత్ రవినాయక్, చల్లా బాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: ప్రచారంలో రంజిత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు

డొక్కా సీతమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: డొక్కా సీతమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. 19వ దశకపు నిత్యాన్న దాత డొక్కా సీతమ్మ 116వ వర్ధంతి సందర్భంగా నాగోల్‌లోని కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో మంగళవారం ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాఢభూషి శ్రీధర్, రచయిత్రి, ప్రవచన కర్త డా.అనంత లక్ష్మి, ఆకృతి సుధాకర్, మదర్ థెరిసా ఫౌండేషన్ అధ్యక్షుడు చేపూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న శిక్షణార్థులు

హుడాకాంప్లెక్స్: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన ఎంతో ఉపయోగపడుతుందని శిక్షకుడు గురూజీ ఇస్మాయిల్ అన్నారు. సరూర్ నగర్ హుడాకాంప్లెక్స్ లోటస్‌ల్యాప్ స్కూల్‌లో ఉచిత యోగా శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవులు కావడంతో మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. కొద్దిపాటి శారీరక శ్రమతో వాటన్నింటిని దూరం చేసుకోవడానికి యోగా గొప్ప ఆయుధమన్నారు. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో నరేందర్, దయాదేవి, ఉపేందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

మంచాల: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రజల్లో మరింత మార్పు వస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మంచాల మండలంలోని తాళ్లపల్లిగూడలో వీఆర్‌వస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కల్యాణోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రశాంతంగా జరుపుకోవడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, గణేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మేం సిద్ధం

- ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఏర్పాట్లు
- దేశభక్తి ఉన్నవారు ఓట్లేయండి
- అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్
- దివ్యాంగులకు ఉచిత రాకపోకల సదుపాయం
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్



స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓట్లు వేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. నగరంలో పోలింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం సీపీ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో 45 శాతం పోలింగ్ మాత్రమే జరిగిందని చెబుతూ, ఈసారి పెరుగుతుందని భావిస్తున్నామన్నారు. అయిదేళ్లకోసారి లభించే అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని, దేశభక్తి, దేశంపై ప్రేమ ఉన్న వారు దేశం కోసం ఓటు వేయాలన్నారు. జిల్లాలోని 3,986 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ స్క్రీనింగ్ ఆడియోతో సహా ఉంటుందని, రాజకీయ పార్టీలు కోరితే ఫీడ్ అందజేస్తామని తెలిపారు. ఇంటింటికీ ఓటరుస్లిప్పుల పంపిణీ 81 శాతం పూర్తయిందని, 95 శాతం వరకు జరిగే వీలుందన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 47 కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలో 16,776 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లుండగా, ఇప్పటివరకు 9,266 మంది ఓట్లు వేశారన్నారు. మిగతావారికి 10వ తేదీ వరకు అవకాశం కల్పిస్తామన్నారు. వికలాంగులు 'సాక్షం' యాప్‌లో పేరు నమోదు చేసుకుంటే ఇంటినుంచి పోలింగ్ కేంద్రం వరకు ఉచితంగా రాకపోకల సదుపాయం కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు 288 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. హోమ్ ఓటర్లు 571మందికి గాను ఇప్పటి వరకు 532 మంది ఓట్లు వేశారన్నారు. విధులకు హాజరు కాని సిబ్బందిలో వందమందికి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.

దరఖాస్తు చేయని హౌసింగ్ సొసైటీలు

హౌసింగ్ సొసైటీలు కోరితే పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ఎన్నికల సంఘం అనుమతి ఉన్నప్పటికీ, జిల్లాలో తమకు పోలింగ్ కేంద్రం కావాలంటూ ఏ ఒక్క సొసైటీ కూడా లిఖితపూర్వకంగా కోరలేదన్నారు. పోలింగ్ రోజున వాణిజ్య దుకాణాలు, హోటళ్లు బంద్ పాటించాలన్నారు.

ఇంకా ఏమన్నారంటే..

- ఎండలు తీవ్రంగా ఉన్నందున బాధితులకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వైద్యసాయమందేలా ఏర్పాట్లు. ఇంటింటికీ ఓటరు స్లిప్‌లతోపాటు పోలింగ్‌కు సంబంధించి సమాచార పుస్తకాలు, స్టిక్కర్ల పంపిణీ.
- క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లుగా నియమితులైన 1,250 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఎన్నికల సిబ్బంది అందరికీ అవసరమైన శిక్షణలు పూర్తి.
- గత అసెంబ్లీ ఎన్నికల మాదిరే పోలింగ్ కేంద్రం వద్ద ఎంతమంది క్యూలో ఉన్నారో తెలుసుకునేలా పోల్‌క్యూ రూట్ యాప్ అందుబాటులో ఉంటుంది. గూగుల్ మ్యాప్‌తో పోలింగ్ కేంద్రం దారి కూడా తెలుసుకోవచ్చు.
- హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థిపై ఉల్లంఘనల కేసులు నమోదు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పనిసరిగా మహిళా సిబ్బంది ఉండేలా ఏర్పాటు. వేలిపై పురుషులు ఇంక్‌మార్క్ వేస్తే ఇబ్బంది పడే వారుంటే.. మహిళా సిబ్బందితోనే ఇంక్ వేయించే ఏర్పాటు.
- ప్రచార గడువు ముగిశాక కూడా పత్రికలు, సోషల్ మీడియాలో 'సైలెన్స్ ప్రచారం' చేసుకోవచ్చు. వాటికి ముందస్తు అనుమతి అవసరం. ఏఎస్‌డీ(ఆబ్సెంట్,షిఫ్టెడ్,డెత్)ఓటర్లుగా ఇప్పటి వరకు 18వేల మందిని గుర్తించాం. ఈ సంఖ్య ఇంకా పెరగనుంది.
- సమావేశంలో హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అనుదీప్ దురిశెట్టి, హేమంత్ కేశవ్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ తేదీ తెలిపే ఓటరు స్టిక్కరు, 'ఐ ఓట్ ఫర్ షూర్' తదితర స్టిక్కర్లను ప్రదర్శించారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి భద్రత..

డీఆర్‌సీలు, స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతల పరంగా 383 సమస్యాత్మక కేంద్రాలు సహా మొత్తం 1,046 పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రత ఏర్పాట్లు చేస్తామన్నారు. 14వేల మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు వైన్ షాపులు పోలింగ్‌కు 48 గంటల ముందే మూసివేయాల్సి ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్ తదితరులు

పోలింగ్‌కు అదనపు సమయం

- ఎండల దృష్ట్యా గంట పెంపు
- ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: ఓటర్ స్లిప్పుల పంపిణీ 96 శాతం పూర్తయిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుందన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక గంట అదనంగా పెంచామన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో 537 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇప్పటివరకు 4,624 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. బుధవారం వరకు సమయం ఉందన్నారు. వయోవృద్ధులు, వికలాంగులు, 234 మంది ఉన్నారని, వారిలో 98 శాతం ఓటు హక్కును ఉపయోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ సిబ్బంది కోసం 128 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. 751 ఈవీఎం ప్యాడ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 56 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని, పోలీస్ నిఘా నిరంతరం కొనసాగించనున్నామన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన కారణంగా సరూర్‌నగర్ స్టేడియాన్ని ఏ రాజకీయ పార్టీలకు ఇవ్వడానికి అనుమతిలేదన్నారు. సమావేశంలో ఆయనతో నాయబ్ తహసీల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

బద్దం బాల్‌రెడ్డికి నివాళి

గోల్కొండ: కార్వాన్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు దివంగత బద్దం బాల్‌రెడ్డి జయంతిని మంగళవారం గుడిమల్కాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గాయపడిన వ్యక్తి మృతి

- మరుగుతున్న కూర పాత్రలో పడి చికిత్స పొందుతూ మృత్యువాత

ధారూరు: చికెన్ వండిన పాత్రలో పడి తీవ్ర గాయాలైన వ్యక్తి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధారూరు మండలంలోని కుక్కింద గ్రామానికి చెందిన గౌ(రెం)కల మల్లయ్య(45) ఈ నెల 2న మండల కేంద్రంలో బీఆర్ఎస్ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ముగియగానే అందరితో పాటు భోజనానికి వెళ్లారు. ఒక్కసారిగా గుంపుగా జనాలు భోజనం కోసం ఎగబడ్డారు. అక్కడ మల్లయ్య అతికష్టం మీద భోజనం వడ్డించుకుని చికెన్ కోసం వేడిగా ఉన్న పాత్ర దగ్గరికి వెళ్లారు. ఆ తోపులాటలో అదుపు తప్పి చికెన్ పాత్ర(బొగవాన)లో పడిపోయారు. వేడి ఎక్కువ ఉండడంతో ఆయన కాళ్లు, చేతులు, నడుము భాగం కాలిపోయింది. వెంటనే 108 వాహనంలో వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మరోపక్క ఆయనకు తోడుగా ఉన్న తల్లి రాజమ్మ అదృశ్యమైంది. ఆమె రెండో కుమారుడు కృష్ణ అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోకపోవడంతో మల్లయ్య మృతి చెందాడని గ్రామస్తులు ఆరోపించారు. మృతుడి సోదరుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. మంగళవారం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉగ్రదాడులకు మోదీ చెక్ పెట్టారు

- కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: దేశంలో 2014కు ముందు పెద్ద ఎత్తున ఉగ్రదాడులు జరిగేవని మోదీ ప్రధాని అయిన తర్వాత ఒక్క దాడికి కూడా తావు లేకుండా చేశారని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో సీనియర్ నేత పాదూరి కరుణ ఏర్పాటు చేసిన కాలనీ వాసుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన కరెన్సీని ఇతర దేశాల్లో ముద్రించి ఐఎస్ఐ ద్వారా ఇండియాలో కూడా చలామణి చేశారని, ఐఎస్ఐని దెబ్బతీయడంలో పెద్ద నోట్ల రద్దు కూడా ఒక భాగమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఏమీ దొరకక ఏదో ఒకటి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పది లక్షల కోట్ల అభివృద్ధికి రేవంత్‌కు గాడిద గుడ్డులా కనిపిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నారెడ్కో కౌన్సిల్ ప్రెసిడెంట్ పాదూరి రవికాంత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్ అధ్యక్షుడు వైవై.రెడ్డి, రాజ మహేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షురాలు ప్రవీణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్ దగ్ధం

మొండిగౌరెల్లిలో రూ.5 లక్షల మేర నష్టం



మంటల్లో కాలిపోతున్న ట్రాక్టర్

యాచారం: గడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో కాలి బూడిదయింది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన మాదం బుచ్చయ్య పశువుల కోసం ఓ రైతు వద్ద పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి మంగళవారం సాయంత్రం మేకల రాములు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నారు. అప్పటికే ఈదురుగాలులు వీయడంతో ఈ క్రమంలో గ్రామ సమీపంలోని రోడ్డు మధ్యలో పైన ఉన్న విద్యుత్ వైర్లు గాలికి అటు, ఇటు ఊగి మంట చేలరేగి ట్రాక్టర్‌లో గడ్డికి అంటుకున్నాయి. దీంతో వేగంగా మంటలు వ్యాప్తి చెందాయి. గమనించిన స్థానికులు నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌తో పాటు గడ్డి పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.5 లక్షలకు పైగానే నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను ఆదుకోవాలని కోరారు.

పాముకాటుకు వృద్ధుడి బలి

మొయినాబాద్: పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. మొయినాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన కడుమూరి కృష్ణారెడ్డి(62) ఈ నెల 3న సాయంత్రం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. వరి చేను గట్లపై ఆయన తిరుగుతుండగా ఓ పాము కాటు వేసింది. ఈ విషయాన్ని ఆయన కుమారుడు మల్లారెడ్డికి చెప్పడంతో వెంటనే స్థానికంగా ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున కృష్ణారెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లిఫ్ట్ ఇచ్చి.. నగదు దోచి

అమాయకుడిపై దాడి చేసిన దుండగులు

షాద్‌నగర్‌రూరల్: లిఫ్ట్ అడిగిన పాపానికి ఓ యువకుడిపై దాడి చేసి నగదు దోచుకెళ్లిన సంఘటన మంగళవారం షాద్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించిన డీఐ రామిరెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటకు చెందిన శివకుమార్ గత కొంత కాలంగా ఫరూఖ్‌నగర్ మండల వెలిజర్ల గ్రామ శివారులో ఉన్న ఓ పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్నాడు. ఈనెల 5న శివకుమార్ సెల్‌ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు షాద్‌నగర్‌కు వచ్చాడు. తిరిగి పౌల్ట్రీ ఫాం వద్దకు వెళ్లేందుకు చటాన్‌పల్లి రైల్వే గేటు వద్ద ఆటోల కోసం ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన వారిని శివకుమార్ లిఫ్ట్ అడిగాడు. చటాన్‌పల్లికి చెందిన గంటా నిరీషన్, దినేష్‌లు అతన్ని బైక్‌పై ఎక్కించుకున్నారు. బుచ్చిగూడ రోడ్డులోని బైపాస్ అండర్ బ్రిడ్జి సమీపంలోకి వెళ్లగానే నిర్మానుష్య ప్రాంతంలో శివకుమార్‌పై వారు దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.5,300 దోచుకొని పరారయ్యారు. దీనిపై శివకుమార్ మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన డీఐ రామిరెడ్డి తన బృందంతో నిందితులను గుర్తించి గంటా నిరీషన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు దినేష్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌తోనే దివ్యాంగులకు సంక్షేమం

- రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



ర్యాలీలో పాల్గొన్న వీరయ్య తదితరులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. ఆయన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, పెరిక కులస్తుల తరఫున చేపట్టిన విజయ సంకల్పయాత్ర-2 మంగళవారం ఆమనగల్లు పట్టణానికి చేరుకుంది. ఈ మేరకు పట్టణంలో మల్లు రవికి మద్దతుగా దివ్యాంగులు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే దివ్యాంగులకు సంక్షేమాభివృద్ధి జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు, చేనేత కార్మికులకు మొట్ట మొదటగా పెన్షన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. వీరికి హోం హస్టల్స్, ఉద్యోగంలో రిజర్వేషన్‌లు, ఆసరా లేని వృద్ధులకు, వితంతువులకు ఇళ్లలో రిజర్వేషన్లు ఇచ్చిందన్నారు. వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. అలాగే అంత్యోదయ కార్డులు ఇచ్చి 35 కిలోల రేషన్ బియ్యం అందించిందని గుర్తు చేశారు. గ్రామాల్లో వలసల నివారణకు పేదలకు పని కల్పించేందుకు ఉపాధిహామీ పథకం తీసుకువచ్చిందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో6 అంశాలను పొందుపరిచిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు దివ్యాంగుల సంక్షేమంపై ఏమాత్రం దృష్టి సారించలేదన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మల్లు రవిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్, పార్టీ గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు దేశగాని సతీశ్‌గౌడ్, పెరిక కుల కార్పొరేషన్ సాధన నాయకుడు కోట మల్లికార్జున్‌రావు, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ అనితావిజయ్, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు కృష్ణనాయక్, శ్రీశైలం, విజయ్‌రాథోడ్, వెంకటయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, గణేశ్, కొండల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ మ్యాచ్‌కు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 8వ తేదీన జరుగనున్న ఐపీఎల్-20 క్రికెట్ మ్యాచ్ కోసం నగరంలోని వివిధప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.ఈసీఐఎల్, ఎల్‌బీనగర్, కొండాపూర్, జీడిమెట్ల, వనస్థలిపురం, ఇబ్రహీంపట్నం ,మియాపూర్,లకిడికాపూల్, కూకట్‌పల్లిహౌసింగ్‌బోర్డ్, జూబ్లీబస్‌స్టేషన్,హకీంపేట్, మేడ్చల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహదీపట్నం, బీహెచ్ఈఎల్,తదితర ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియంకు ప్రత్యేక బస్సులను నడుపనున్నారు. అలాగే ప్రయాణికుల రద్దీ మేరకు వివిధ మార్గాల్లో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాయదుర్గం నుంచి నాగోల్ వరకు మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మధ్య ప్రయాణికుల డిమాండ్ మేరకు మెట్రో సేవలు అందుబాటులో ఉంటాయి.

దేశంలో మోదీ హవా నడుస్తోంది



విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన మీర్‌పేట కార్పొరేటర్ మమత

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ మమత ప్రవీణ్ తమ అనుచరులతో కలిసి మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం మొత్తం మోదీ హవా నడుస్తోందని, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కాలం చెల్లిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 12 నుంచి 15 ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని చెప్పారు. రెండు లక్షల మెజార్టీతో గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములుయాదవ్, శంకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, నాయకులు నర్సింహ, నీలారవినాయక్, నాగరాజు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

14 మంది జూదరుల అరెస్ట్

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామ సమీపంలోని ఓ ఫాంహౌజ్‌లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై సోమవారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో వినోద్ ఫాంహౌస్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆర్గనైజర్ సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో దాడులు చేశారు. 14 మందిని అదుపులోకి తీసుకోగా, ఆరుగురు పరారయ్యారు. వారి నుంచి రూ.1,02,600 నగదుతో పాటు, 14 సెల్‌ఫోన్లు, మూడు ఫోర్ వీలర్ వాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు వినోద్‌తో పాటు జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన నగదు, సెల్‌ఫోన్స్